క్లుప్తంగా

ఆకట్టుకున్న భరత నాట్య ప్రదర్శన



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న వసంతోత్సవ నృత్యోత్సవాల్లో భాగంగా చివరి రోజు ఆదివారం ముంబైకి చెందిన ప్రముఖ భరతనాట్య కళాకారిణి నమిత బొడ్జి శిష్య బృందం భరతనాట్య ప్రదర్శన సందర్శకులను అలరించింది. మురళికొత్వం, రంజని మృదు పంకజ లోచన, తుం బిన్ మేరే హిందీ భజన, రుసలి రాధా పదం, శంభో, కామిని మై, తిల్లాన తదితర అంశాలను ప్రదర్శించారు. కళాకారులు నమిత, అనిత, వ్రత, తూషిత, ఆద్య తదితరులు పాల్గొన్నారు.

కార్మిక పక్షపాతి సీఎం కేసీఆర్

- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: కార్మికుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా మే1న నిర్వహించనున్న భారీ బహిరంగసభను విజయవంతం చేయాలని పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ అనుబంధ విభాగం భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి యాదగిరియాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మేడే సన్నాహక సమావేశానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కృషితో నూతన పారిశ్రామిక విధానం మూలంగా ప్రపంచ స్థాయి పరిశ్రమలు ఏర్పాటు అవుతున్నాయన్నారు. నియోజకవర్గంలోని వివిధ పరిశ్రమలలో కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందాలను చేసిన ఘనత బీఆర్‌టీయూకే దక్కిందని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణ, జిల్లా అధ్యక్షులు శివశంకర్, ఈఎస్ఐ బోర్డుమెంబర్ రమణారెడ్డి, వివిధ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారానికి చర్యలు

జిన్నారం(పటాన్‌చెరు): వేసవికాలంలో నీటి సమస్యను పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. మండలంలోని దాదిగూడెం గ్రామంలో ఎమ్మెల్యే తన సొంత నిధులు రూ.3లక్షలతో వేయించిన బోరును ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, సర్పంచ్ ఆంజనేయులు, ఎంపీటీసీ వెంకటేశంగౌడ్ పాల్గొన్నారు.

రేషన్ షాపు ప్రారంభం

భాగ్యనగర్‌కాలనీ: తెల్ల రేషన్ కార్డు పొందిన ప్రతి ఒక్కరూ ప్రతినెల క్రమం తప్పకుండా రేషన్ సరుకులను తీసుకోవాలని అందిపుచ్చుకోవాలని శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ఆదివారం హైదర్‌నగర్‌లో నూతనంగా మంజూరైన రేషన్ షాపును డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ... ప్రభుత్వం అందజేస్తున్న రూపాయికి కిలో బియ్యాన్ని, ఇతర వస్తువులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు నక్క శ్రీనివాస్, పోతుల రాజేందర్, వెంకటేష్‌యాదవ్, కుమారస్వామి, సత్యనారాయణ, సత్తార్ తదితరుల ఉన్నారు.

హరి సంకీర్తనలతో ప్రశాంతత

పటాన్‌చెరు టౌన్: హరే రామ, హరే కృష్ణ సంకీర్తనలతో ప్రశాంతత లభిస్తుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ అన్నారు. ఆదివారం పటాన్‌చెరు పట్టణంలోని శాంతినగర్ హనుమాన్ దేవాలయంలో అఖండ హరి కీర్తన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్‌ను ఆలయ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కద్నవన సింగ్, చౌదరి, కమల్‌సింగ్, కిషన్, మెట్టు కృష్ణ, మెట్టు రాజుయాదవ్, సందీప్, రమేష్, మనోజ్, సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

పూజల్లో కాంగ్రెస్ నాయకులు...

పట్టణంలోని శాంతినగర్ హనుమాన్ దేవాలయంలో నిర్వహించిన 24 గంటల అఖండ హరిసంకీర్తన కార్యక్రమంలో పటాన్‌చెరు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, నాయకులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షుడు యువరాజ్, కిషన్, రాజేందర్‌సింగ్, చంద్రశేఖర్, మహాదేవ్, పాండే పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మహిళల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. శనివారం రాత్రి భారతినగర్ డివిజన్ పరిధిలోని మాక్స్‌సొసైటీ కాలనీలో రమాబాయి మహిళా మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తుందన్నారు. మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు త్వరలో కుట్టుమిషన్‌లు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సింధుఆదర్శ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బతుకుదెరువుకు బాటలు..

- నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు
- జీహెచ్ఎంసీ సహకారంతో లైట్ హౌస్ ఫౌండేషన్ శిక్షణ
- హుడా కాలనీలో కేంద్రం ఏర్పాటు
- నేడు ప్రారంభం



లైట్ హౌస్ శిక్షణ కేంద్రం

మియాపూర్: యువతకు చదువుతో పాటు ఆయా రంగాల్లో నైపుణ్యం ఉంటేనే ఉద్యోగాన్వేషణలో విజయం సాధిస్తారు. ఈ నేపథ్యంలో యువతకు ఆయా రంగాల్లో ప్రత్యేక శిక్షణ ఇవ్వడమేగాక ఉద్యోగావకాశాలు కల్పించి వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు లైట్ హౌస్ కమ్యూనిటీ ఫౌండేషన్ ముందుకు వచ్చింది. జీహెచ్ఎంసీ సహకారంతో లైట్ హౌస్ ఫౌండేషన్ తొలి కేంద్రాన్ని చందానగర్‌లోని హుడా కాలనీలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం సోమవారం ప్రారంభం కానుంది. 10వ తరగతి, ఆ పై విద్యార్హత గల బస్తీ వాసులకు ఈ శిక్షణ ఇవ్వనున్నారు. యువత ఆసక్తి మేరకు ఆయా రంగాల్లో ప్రత్యేక శిక్షణ ఇవ్వడమేగాక ఉపాధి కల్పనకు చేయూత అందిస్తారు.

బస్తీ, వీకర్ సెక్షన్లలో యువతే లక్ష్యంగా ...

బస్తీ, వీకర్ సెక్షన్ కాలనీలైన పాపిరెడ్డి కాలనీ, శాంతినగర్, ఇందిరానగర్, హుడా కాలనీల్లో యువత ఎక్కువగా ఉండడంతో చందానగర్‌ను శిక్షణకు అనువైన ప్రాంతంగా గుర్తించారు. గతంలో శాంతినగర్‌లో ఏర్పాటు చేసిన కేంద్రం అనువుగా లేకపోవడంతో చందానగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ హుడా కాలనీలోని చందానగర్ ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్ వద్ద నిరుపయోగంగా ఉన్న జీహెచ్ఎంసీ మోడల్ మార్కెట్ భవనాన్ని ఎంపిక చేశారు. గతంలో మోడల్ మార్కెట్ కోసం నిర్మించిన భవనానికి మార్పులు చేశారు. సీఎస్ఆర్ కింద ప్రిన్సిపల్ గ్లోబల్ సర్వీసెస్ సంస్థ రూ.80 లక్షలతో అధునాతన వసతులు, హంగులను కల్పించింది. కార్పొరేట్ కార్యాలయం స్థాయిలో గదులను ఏర్పాటు చేశారు. మహిళల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

ఫ్రంట్ ఆఫీస్, ఐటీ శిక్షణ కోసం కంప్యూటర్ రూమ్, పై అంతస్తులో టైలరింగ్, బ్యూటీషియన్ కోసం ప్రత్యేక వసతులు కల్పించారు. ఫ్యాషన్ టెక్నాలజీ, బ్యూటీపార్లర్ కేంద్రం, ట్రైనింగ్ సెంటర్, కౌన్సెలింగ్ సెంటర్‌లకు విడిగా గదులను కేటాయించారు. కేంద్రం కార్యకలాపాలను పర్యవేక్షించేందుకు హెడ్ మేనేజర్, స్కిల్ డెవలప్‌మెంట్ మేనేజర్, ప్లేస్‌మెంట్ కో–ఆర్డినేటర్, ఫ్యాషన్ టెక్నాలజీ, కంప్యూటర్ రంగాల నిపుణులు, యువతకు అవగాహన కల్పించేందుకు కో–ఆర్డినేటర్, వారి సహాయకులు మొత్తం కలిపి 8 మంది ఉద్యోగులు ఇక్కడ సేవలు అందిస్తున్నారు.

అర్హత... శిక్షణ వివరాలివీ...

ఆయా బస్తీలకు చెందిన 18 నుంచి 35 ఏళ్ల లోపు యువతీ, యువకులు శిక్షణకు అర్హులు. అభ్యర్థులు కనీసం 10 వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. డిగ్రీ, బీటెక్ చదివిన వారికి తగిన కోర్సులు ఎంపిక చేసి శిక్షణ ఇస్తారు. ప్రతిరోజు ఉదయం 9 గంటలు, మధ్యాహ్నం రెండు గంటలకు రెండు బ్యాచ్‌లుగా శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. 3 నుంచి 6 నెలల పాటు ఎంచుకున్న రంగాల్లో మెళకువలు నేర్పిస్తారు. దీంతో పాటు ఆన్‌లైన్ ట్రైనింగ్ ఇస్తారు. శిక్షణ పూర్తయిన తరువాత ఫౌండేషన్ ఆధ్వర్యంలో సర్టిఫికెట్ అందించి వారి సామర్థ్యాన్ని బట్టి పలు కంపెనీల్లో అవకాశాలు కల్పిస్తారు. ఇప్పటి వరకు సుమారు 100 మందికి పైగా శిక్షణ ఇచ్చి 40 మంది వరకు ఉద్యోగ అవకాశాలు కల్పించారు.



శిక్షణ తరగతుల కోసం ఏర్పాటు చేసిన కంప్యూటర్లు

నిపుణులతో కౌన్సెలింగ్ ...

ఆయా బస్తీల్లో 10 లేదా డిగ్రీ వరకు చదివిన యువతీ, యువకులను గుర్తించి వారు కేంద్రానికి వచ్చేలా అవగాహన కల్పిస్తారు. వ్యక్తిత్వ వికాసం, డిజిటల్ అక్షరాస్యత, స్పోకెన్ ఇంగ్లిష్, కెరీర్ కౌన్సెలింగ్, వృత్తి నైపుణ్య కోర్సులు, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఐటీ పరిశ్రమలు, టైలరింగ్, బ్యూటీపార్లర్, రిటైల్ స్టోర్స్, హెల్త్, హాస్పిటలిటీ, ఆటో మొబైల్, హార్డ్‌వేర్, గ్రీన్ ఎనర్జీ సోలార్, డ్రైవింగ్ విభాగాల్లో శిక్షణ ఇస్తున్నారు. అకౌంట్ ఎగ్జిక్యూటివ్, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, టెస్టింగ్, వెబ్ డెవలప్‌మెంట్, నర్సింగ్ అసిస్టెంట్, ఎలక్ట్రీషియన్, బ్యూటీ అండ్ వెల్‌నెస్ తదితర రంగాల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం



నేతాజీనగర్‌లో పర్యటిస్తున్న రవికుమార్‌యాదవ్ తదితరులు

నేతాజీనగర్‌లో గడప గడపకు బీజేపీ కార్యక్రమం

శేరిలింగంపల్లి: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గడప గడపకు బీజేపీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పార్టీ రాష్ట్ర నాయకులు ఎం.రవికుమార్‌యాదవ్ అన్నారు. గచ్చిబౌలి కార్పొరేటర్ వి.గంగాధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నేతాజీనగర్‌లో నిర్వహించిన గడప గడపకు బీజేపీ కార్యక్రమానికి రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్, నియోజకవర్గ కన్వీనర్ రాఘవేంద్రరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగురవేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. నేతాజీనగర్‌లో మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్ హయాంలోనే అభివృద్ధి జరిగిందన్నారు. బీఆర్ఎస్ పాలనలో చేసిందేమీ లేదని ఆరోపించారు. డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలు, బస్తీల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎల్లేష్, రాధకృష్ణయాదవ్, వినోద్‌రావు, విటల్, హన్మంతు నాయక్, కృష్ణయాదవ్, జితేందర్, వినయ్, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక సమస్యలపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న సైకాలజిస్ట్ డాక్టర్ సీ వీరేందర్

మాదాపూర్: ప్రస్తుతం ఎక్కువ మంది వివిధ రకాల సమస్యలతో బాధపడుతున్నారని సైకాలజిస్ట్ డాక్టర్ సి. వీరేందర్ అన్నారు. మాదాపూర్‌లో యూ అండ్ మీ పేరిట ఆదివారం మెంటల్ హెల్త్ అవగాహన ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఏదో ఒక సమస్యతో బాధ పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో యాంగ్జైటీ, డిప్రెషన్, ఓసీడీ, లవ్ సమస్యలు, కపుల్ కౌన్సిలింగ్, కెరీర్ గైడెన్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, టీచర్స్ ట్రైనింగ్, లీడర్ షిప్ స్కిల్స్‌పై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. డిప్రెషన్ కారణంగా భయభ్రాంతులకు గురికావడం, అలసట, మానసిక ఒత్తిడికి గురికావడం తదితర సమస్యలను ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. వివరాల కోసం 9390771469లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

'ఈస్టర్' సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు



ఈస్టర్ వేడుకలకు హాజరైన క్రైస్తవులు

ఏసుక్రీస్తు పునరుద్ధానం సందర్భంగా ఆదివారం మియాపూర్ కల్వరి టెంపుల్‌లో డాక్టర్ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఆరాధనలు నిర్వహించారు. సందర్భంగా ఆయన ప్రత్యేక బోధనలు చేశారు.

– హఫీజ్‌పేట్



ప్రత్యేక ఆరాధనలు చేస్తున్న డాక్టర్ సతీష్ కుమార్

ముగ్గురిపై కేసు నమోదు

పటాన్‌చెరు టౌన్: పెళ్లి కాకుండానే కట్నం వేధింపులకు గురి చేసిన ఘటనలో ముగ్గురిపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు పట్టణానికి చెందిన జంగయ్య కూతురు యామినికి, భానూర్ కంచర్ల గూడెంకు చెందిన నర్సింలు, లక్ష్మిల కుమారుడు శంకర్‌తో మార్చి 26న నిశ్చితార్థం జరిగింది. మే 4న వివాహం జరగనుంది. అయితే పెళ్లికి ముందే కట్నం డబ్బులు, బైక్ ముందే ఇవ్వాలని పెళ్లికూతురికి ఫోన్ చేసి శంకర్ ఇష్టంవచ్చినట్లు మాట్లాడంతో శనివారం భవనంపై నుంచి దూకి ఆత్మహత్య యత్నానికి పాల్పడింది. ఈ విషయంలో శంకర్, తల్లిదండ్రులు నర్సింలు, లక్ష్మిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం

గచ్చిబౌలి : గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ మహేష్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నానక్‌రాంగూడ రోటరీ వద్ద ఎగ్జిట్ నెం 19 సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి (35–40) మృతి చెంది ఉండటాన్ని గుర్తించిన స్థానికులు ఆదివారం పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న రాయదుర్గం పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అతను మూడు రోజుల క్రితమే మృతి చెంది ఉండవచ్చునని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

కుక్కల దాడిలో బాలుడికి గాయాలు

జిన్నారం(పటాన్‌చెరు): కుక్కల దాడిలో బాలుడికి గాయాలైన ఘటన జిన్నారం గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన యాదగిరి కుమారుడు రుత్విక్ ఆరుబయట ఆడుకుంటున్నాడు. అక్కడే ఉన్న కుక్కలు బాలునిపై దాడి చేశాయి. చేతికి తీవ్ర గాయాలవడంతో కుటుంబ సభ్యులు ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం చేయించారు.

సర్పంచ్ నీలం మధు ఆర్థిక సాయం

విషయం తెలుసుకున్న చిట్కుల్ సర్పంచ్ నీలం మధు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.5వేల ఆర్థిక సాయం ప్రకటించారు. ఇందుకు గాను యాదగిరి కుటుంబ సభ్యులు నీలం మధుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

లేగదూడకు తీవ్ర గాయాలు

శివ్వంపేట(నర్సాపూర్): ఊర కుక్కల దాడిలో లేగదూడకు తీవ్ర గాయాలైన సంఘటన శివ్వంపేటలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రుస్తుంపేట శ్రీనివాస్ తన పశువులను వ్యవసాయ పొలం వద్ద పాకలో ఉంచగా ఊరకుక్కలు లేగదూడపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. లేకదూడ పరిస్థితి విషమంగా ఉందని బాధిత రైతు శ్రీనివాస్ పేర్కొన్నారు. కుక్కల వల్ల ఇబ్బందులు పడుతున్నామని ఈ విషయంలో ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

రంజాన్ మాసం పవిత్రమైనది



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ, దాత్రీగౌడ్ తదితరులు

హఫీజ్‌పేట్ : రంజాన్ మాసం చాలా పవిత్రమైనదని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ అన్నారు. ఆదివారం ఓల్డ్ హఫీజ్‌పేట్‌లో బీఆర్ఎస్ నాయకులు దాత్రీ గౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదరులకు దవాత్ ఏ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ దాత్రీగౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసం సందర్భంగా నిష్ఠతో పాటించే ఉపవాస దీక్షలు, దైవ ప్రార్థనలతో సామరస్యం, శాంతి సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇవ్వడం అభినందనీయమన్నారు. రంజాన్ పండుగ ప్రజా జీవితాల్లో సుఖ సంతోషాలను నింపాలన్నారు. ముస్లింల సంక్షేమానికి ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అశోక్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు వీరేశం గౌడ్, శ్రీనివాస్‌యాదవ్, వాసిల్లి చంద్రశేఖర్ ప్రసాద్, అక్తర్ తదితరులు పాల్గొన్నారు.

16న హైటెక్స్‌లో ఇన్వెస్టర్స్ బిజినెస్ సమ్మిట్ 2023



బ్రోచర్ విడుదల చేస్తున్న దృశ్యం

మాదాపూర్: మార్కెట్ డిమాండ్, వ్యాపారస్తుల కోసం 30శాతం లాభాలు ఉన్న అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు నైమిషా బిజినెస్ క్లబ్ మేనేజింగ్ డైరెక్టర్ కేవీఎస్ఎన్ మూర్తి తెలిపారు. మాదాపూర్‌లోని వాకింగ్ స్ట్రీట్ డ్రైవ్ ఇన్‌లో ఆదివారం ఇన్వెస్టర్స్ బిజినెస్ సమ్మిట్ 2023 నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నైమిషా బిజినెస్ క్లబ్ ఆధ్వర్యంలో తొలిసారిగా ఈనెల 16న మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో వ్యాపార సదస్సును నిర్వహించనున్నట్లు తెలిపారు. అంకుర సంస్థ నిర్వాహకులకు అవసరమైన నిధుల సేకరణ, పెట్టుబడులతో పాటు, ప్రముఖ మార్గదర్శకుల నేతృత్వంలో అన్ని విధాలుగా ఉపయోగపడే రీతిలో ఈ సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. యువ పారిశ్రామిక వేత్తలు, మహిళా పారిశ్రామిక వేత్తలకు అవకాశాలను కల్పిస్తామన్నారు. రూ. 1.75 లక్షల ప్లగ్, ప్లే పరిశ్రమలు, రూ.2.50 లక్షలతో ఆరోగ్య స్థాపన, రూ. 4.10 లక్షలతో ఆన్‌లైన్ రేడియో స్టేషన్లు, రూ. 8.15 లక్షల గేమింగ్ జోన్‌లు అందుబాటులో ఉన్నాయి. రిజిస్ట్రేషన్ కోసం ఫోన్ నెం. 8121218888, 7036466161, 9666985599లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో శ్రీనిత్, సుధాకర్, సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

శేరిలింగంపల్లి: నల్లగండ్లలో హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల దాహార్తిని తీర్చడంలో హోప్ ఫౌండేషన్ ముందుంటుందన్నారు. ఆరేళ్లుగా చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ హైదరాబాద్ హోప్ అధ్యక్షులు మహిపాల్‌రెడ్డి, ప్రతినిధులు నూకల సందీప్, మారం వెంకట్, రెడ్డి ప్రవీణ్‌రెడ్డి, శాంతిభూషన్‌రెడ్డి, విజయేందర్‌రెడ్డి, మల్లేష్ యాదవ్, బాల్‌రాజ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కొండ విజయ్ తదితరులు

మధురానగర్‌లో..

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్ మధురానగర్ కూడలి(దాబా) వద్ద చలివేంద్రాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. రాయదుర్గానికి చెందిన మూల రఘుపతిగౌడ్ జ్ఞాపకార్థం బీజేపీ జిల్లా కార్యదర్శి మూల అనిల్‌కుమార్‌గౌడ్ ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాదచారులు, ప్రయాణికులకు వేసవిలో దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు దోహదం చేస్తాయన్నారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని, పాదచారులు, ప్రయాణికులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మూల కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా విఘ్నేశ్వర ఆలయ వార్షికోత్సవం



హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ, శ్యామలాదేవి దంపతులు

రాయదుర్గం: వేదపండితుల మంత్రోచ్చారణలు, భక్తుల జయజయధ్వానాల మధ్య గచ్చిబౌలి డివిజన్‌లోని డైమండ్ హైట్స్‌లోని విఘ్నేశ్వరస్వామి ఆలయ ఐదవ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు, అలంకారం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం హోమం చేశారు. కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, కాలనీవాసుల పర్యవేక్షణలో ఈ వేడుకలు జరిగాయి. ప్రభుత్వవిప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ, ఆయన సతీమణి శ్యామలాదేవి స్వామి వారిని దర్శించుకున్నారు. కాలనీవాసులు, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మంత్రిప్రగడ సత్యనారాయణ, స్థానికులు రామారావు, లక్ష్మణ్, కృష్ణ, కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో మహనీయుల విగ్రహాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో జాతిపిత మహాత్మా గాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం పటాన్‌చెరు మండలం ముత్తంగిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 12న తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని వెలిమెల తండా, 13న కొల్లూరు గ్రామంలో, 14న పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ గ్రామ చౌరస్తాలలో సొంత నిధులతో ఏర్పాటు చేసిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహాలను ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. 16వ తేదీన బీరంగూడ చౌరస్తాలో మహాత్మ బసవేశ్వరుడి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇస్నాపూర్ చౌరస్తాలో చిట్కుల్ గ్రామానికి వెళ్లే ముఖ ద్వారం వద్ద ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. పటాన్‌చెరు డివిజన్ జీహెచ్ఎంసీ వార్డు కార్యాలయం ఏర్పాటుకు జాతీయ రహదారి పక్కన.. 500 గజాల స్థలం కేటాయించడంతో పాటు రూ.6 కోట్ల నిధులు కేటాయించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. మొత్తం ఐదు అంతస్తుల్లో నిర్మాణం చేపట్టి, మొదటి అంతస్తులో వార్డు కార్యాలయం, మిగిలిన అంతస్తుల్లో ప్రెస్ క్లబ్, వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రజల కోసం వారివారి భాషల్లో గ్రంథాలయాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. త్వరలో నియోజకవర్గంలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేయబోతున్నట్లు ప్రకటించారు. దీనికి సంబంధించిన ప్రక్రియ తుది దశకు చేరుకుందని తెలిపారు. సికింద్రాబాద్‌లో జరిగిన బీజేపీ బహిరంగ సభలో ప్రధాని మోదీ సీఎం కేసీఆర్ కుటుంబంపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. కుటుంబ పరిపాలన గురించి ప్రధాని మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని, దేశంలో కుటుంబ పాలన సాగిస్తున్న పార్టీలతో కలిసి ప్రభుత్వాలను ఏర్పాటు చేస్తూ.. మరోపక్క కుటుంబ పాలన అంటూ మాట్లాడడం ప్రధాని విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.